



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 11 సంచిక :18 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం సోమవారం 23 సెప్టెంబర్ 2024 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :18 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM MON 23 SEPTEMBER 2024 PRICE : 5/- RS

*Simultaneously Published form Visakhapatnam, Kakinada, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur*


# త్వరలోనే నామినేటెడ్ పోస్టుల భర్తీ...

## మూడు పార్టీల్లో కష్టపడిన వారికి ప్రాధాన్యం: చంద్రబాబు

- మంత్రులు, ఎమ్మెల్యేలు, గ్రామస్థాయి నేతలతో టెలీకాన్ఫరెన్స్
- కార్యకర్తలకు ఇచ్చే ప్రమాద బీమా రూ.5 లక్షలకు పెంపు
- 100 రోజుల్లో ఏం చేశామో ప్రజలకు వివరించాలన్న చంద్రబాబు



పెన్ పవర్ డెస్క్:ఏపీ సీఎం చంద్రబాబు నేడు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్చార్జిలు, గ్రామ స్థాయి టీడీపీ నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. త్వరలోనే నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తామని చెప్పారు. నామినేటెడ్ పోస్టుల భర్తీకి కసరత్తు చేస్తున్నామని, కూటమిలోని మూడు పార్టీల్లో కష్టపడ్డ నేతలకు ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం అని, వారి త్యాగాలు చిరస్మరణీయం అని కొనియాడారు. కార్యకర్తలకు ఇచ్చే ప్రమాద బీమాను రూ.2 లక్షల నుంచి రూ. 5 లక్షలకు పెంచామని వెల్లడించారు. పార్టీ స్కిల్ డెవలప్‌మెంట్, ఎంపవర్‌మెంట్ విభాగం ద్వారా యువతకు వివిధ కంపెనీలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని, ఎన్ఆర్ఐ టీడీపీ విభాగం ద్వారా విద్యార్థులకు శిక్షణను ఇచ్చి విదేశాల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నామని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని చంద్రబాబు చెప్పారు. 100 రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వం అని ప్రజలు అంటున్నారని వివరించారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ పథకం అమలు చేస్తామని తెలిపారు.

**చంద్రబాబు వ్యాఖ్యల హైలైట్స్...**

- చరిత్రలో కనీవినీ ఎరుగని విజయాన్ని ప్రజలు మనకు ఇచ్చారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా మన పాలన ఉండాలి.
- గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పులు చేసి వ్యవస్థలను సర్వనాశనం చేసింది.
- నాడు వారు చేసిన పాపాలే నేడు ప్రజలకు శాపాలుగా మారాయి.
- జగన్మోహన్ రెడ్డి అసమర్థ పాలన వల్ల జరిగిన నష్టాన్ని ప్రజా క్షేత్రంలో వివరించాలి.
- కూటమి ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లో మనం చేసిన పనులు ప్రజలకు తెలపాలి. గత పాలకులు పాపాలను ప్రజలకు తెలియజేయాలి.
- సంక్షేమం,అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తున్నాం.
- 2029 నాటికి టీడీపీని తిరుగులేని శక్తిగా మారుస్తా.
- ప్రజల సెంటిమెంట్ తోనూ ఆడుకునే స్థాయికి గత పాలకులు దిగజారారు. కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి లడ్డూలో జంతువుల కొవ్వు వినియోగించారు.
- దోషులను వదలబోము. నేరం చేయడం, తప్పించుకోడానికి ఎదురుదాడి చేయడం అలవాటుగా మారింది. ఇలానే వదిలేస్తే అబద్ధాలను పదేపదే చెప్పి ప్రజలను మోసం చేస్తారు.
- అధికారం చేపట్టగానే తిరుమల నుండే ప్రక్షాళన మొదలు పెట్టాం. తిరుమలలో గోవింద నామస్మరణ తప్ప ఏ ఇతర నినాదాలు వినిపించకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం.
- ప్రజలంతా ఇది మంచి ప్రభుత్వం అని భావిస్తున్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో ఖజానాలో డబ్బులు

వివరాలు 2లో..

# వాస్తవాలు నిగ్గు తేల్చాలి..

## ప్రధాని మోదీకి వైఎస్ జగన్ లేఖ

- తిరుమల లడ్డూ వ్యవహారంలో గత ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు
- వాస్తవాలు వెలికితీయాలంటూ ప్రధాని మోదీని కోరిన జగన్
- కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని వెల్లడి
- సున్నితమైన అంశాన్ని రాజకీయాల కోసం వాడుకుంటున్నారని విమర్శలు



పెన్ పవర్ డెస్క్:తిరుమల లడ్డూ వ్యవహారంలో తమపై తీవ్ర ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో, మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. శ్రీవారి లడ్డూ కల్తీ అంశంలో నిజానిజాలు వెలికితీయాలని తన లేఖలో కోరారు. చంద్రబాబు అసత్య ప్రచారాలు చేస్తున్నాడంటూ ఆరోపించారు.

100 రోజుల అసమర్థ పాలన నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే లడ్డూ వివాదాన్ని తెరపైకి తెచ్చారని జగన్ తన లేఖలో పేర్కొన్నారు. ఈ వివాదంతో కోట్లాది మంది శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని,

వివరాలు 2లో..



# నీ ముఖంలో కొంచెమైనా బాధ కనిపించిందా జగన్?

- తిరుమల లడ్డూ అంశంలో జగన్ వ్యాఖ్యలను తప్పుబట్టిన పట్టాభి
- నువ్వు హిందూ ద్రోహివి జగన్ రెడ్డీ అంటూ విమర్శలు
- ఘోరమైన పాపం జరిగితే తేలిగ్గా మాట్లాడతావా అంటూ ఆగ్రహం

వివరాలు 2లో..

## శ్రీవారి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని సీఎం చంద్రబాబును ఆహ్వానించిన టీటీడీ



- అక్టోబరు 4 నుంచి 12 వరకు తిరుమలలో దసరా బ్రహ్మోత్సవాలు
- ఉండవల్లిలోని సీఎం నివాసానికి వచ్చిన టీటీడీ అధికారులు, అర్చకులు
- సీఎం చంద్రబాబుకు ఆహ్వాన పత్రిక అందజేత

పెన్ పవర్ డెస్క్:కలియుగ ప్రత్యక్ష దైవంగా వెలుగొందుతున్న తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబరు 4వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

వివరాలు 2లో..



## డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తో టీటీడీ ఈవో శ్యామలరావు భేటీ

- ఉండవల్లి వచ్చిన టీటీడీ ఈవో శ్యామలరావు
- బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలంటూ సీఎం చంద్రబాబుకు ఆహ్వానం
- అనంతరం పవన్ కల్యాణ్ ను కలిసిన ఈవో
- తిరుమల లడ్డూ కల్తీపై ఆరా తీసిన పవన్
- గత పాలకమండలి తప్పిదం అని వివరించిన శ్యామలరావు

పెన్ పవర్ డెస్క్:టీటీడీ ఈవో జె.శ్యామలరావు తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సీఎం చంద్రబా బును ఆహ్వానించడం కోసం నేడు ఉండవల్లి వచ్చారు. చంద్రబాబును కలిసి ఆహ్వాన పత్రిక అందించిన అనంతరం, శ్యామలరావు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ను కలిశారు. మంగళగిరి

వివరాలు 2లో..

# ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్

- నంబూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో దీక్షకు శ్రీకారం
- 11 రోజుల పాటు కొనసాగనున్న దీక్ష
- అనంతరం తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్న పవన్ కల్యాణ్



పెన్ పవర్ డెస్క్:శ్రీవారి ప్రసాదం లడ్డూను గత పాలకులు అపవిత్రం చేశారంటూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. ఆదివారం గుంటూరు జిల్లా నంబూరులోని శ్రీ దశావతార వేంకటేశ్వరస్వామి వారి దివ్యక్షేత్రంలో ఆయన ప్రాయశ్చిత్త దీక్షకు

వివరాలు 2లో..

# ఇరాన్ బొగ్గు గనిలో పేలుడు.. 30 మంది కార్మికులు దుర్మరణం

- మీథేన్ గ్యాస్ లీక్ కారణంగా పేలుడు
- 17 మంది కార్మికులకు తీవ్ర గాయాలు
- మరికొంత మంది కార్మికులు లోపల చిక్కుకుపోయినట్లు సమాచారం

వివరాలు 2లో..

పెన్ పవర్ డెస్క్:ఇరాన్ లోని ఓ బొగ్గు గనిలో భారీ పేలుడు సంభవించింది. శనివారం అర్ధరాత్రి ప్రాంతంలో ఈ ఘోరం చోటుచేసుకుంది. దీంతో లోపల పనిచేస్తున్న కార్మికులలో 30 మంది చనిపోయారు. మరో 17 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం విషయం తెలిసి హుటాహుటిన అక్కడికి చేరుకున్న




# బంగాళాఖాతంలో మరో అల్పపీడనం.. ఏపీ, తెలంగాణకు వారం పాటు వర్షాలు

- పశ్చిమ- మధ్య బంగాళాఖాతంలో ఎయిర్ సైక్లోనిక్ సర్క్యులేషన్
- ఈ నెల 23, 24న తెలంగాణ, కోస్తాంధ్ర, యానాంలలో వర్షాలు
- వాతావరణ శాఖ తాజా రిపోర్ట్ లో వెల్లడి

వివరాలు 2లో..

పెన్ పవర్ డెస్క్:బంగాళాఖాతంలో సోమవారం మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) పేర్కొంది. పశ్చిమ-మధ్య బంగాళాఖాతంలో ఎయిర్ సైక్లోనిక్ సర్క్యులేషన్ ఏర్పడిందని, థాయ్ లాండ్ కు ఉత్తరం వైపున మరో సర్క్యులేషన్ ఏర్పడిందని తెలిపింది.



# గిన్నిస్ బుక్ లోకి ఎక్కిన మెగాస్టార్ చిరంజీవి...

**ఇది నేను ఎప్పుడూ ఊహించనిది.. గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు దక్కడంపై చిరు ఆనందం**

**నాకు ఈ గిన్నిస్ రికార్డు దక్కడానికి కారణం అదే అనుకుంటా!: చిరంజీవి**




- 156 చిత్రాల్లో 537 పాటల్లో 24 వేల డ్యాన్స్ మూవ్ మెంట్స్
- భారతీయ సినీ చరిత్రలో అరుదైన ఘనత
- మెగాస్టార్ ఘనతను గుర్తించిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్

వివరాలు 2లో..

పెన్ పవర్ డెస్క్:టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి కీర్తికిరీటంలో మరో కలికితురాయి చేరింది. భారతీయ సినీ చరిత్రలో ఒక అపురూపమైన నటుడు అని గుర్తిస్తూ ఆయనకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ సముచిత స్థానం కల్పించింది. తన సుదీర్ఘ సినీ కెరీర్ లో 156 సినిమాల్లో 537 పాటల్లో 24,000 డాన్స్

## ఎడిటర్ వ్యూ

# అనూహ్యం.. కంగారూ దేశంలో భారత గూఢచర్యం.. కేసు గట్టిదే

ఒక దేశంలో మరో దేశం గూఢచార్యం చేయడం కొత్తేమీ కాదు.. ఆ దేశంలో జరిగే పరిణామాలను గమనిస్తూ తమ దేశానికి చేరవేయడం గూఢచారుల పని. ఎంతో చాకచక్యంగా సాగే ఈ వ్యవహారం మూడో కంటికి తెలియదు. జేమ్స్ బాండ్ సినిమాలను చూసేవారికి గూఢచారి ఎలా ఉంటాడో తెలిసిపోతుంది. ఇప్పుడు ఇదే అంశం భారత్ మరో దేశానికి మధ్య తీవ్ర చర్చనీయాంశం అయింది. అదికూడా భారత్, ఆస్ట్రేలియా, అమెరికా, జపాన్ దేశాల కూటమి మధ్య జరిగే క్వాడ్ సదస్సు కోసం భారత ప్రధాని మోదీ అమెరికాలో పర్యటిస్తున్న సమయంలో చర్చకు రానుంది. %ూశ్రీంశీ =ఝుఃు% – పవన్ ముందు చిన్నబోయిన ఏపీ బీజేపీ ఏమిటీ క్వాడ్? అమెరికాకు దీటుగా ఎదుగుతూ భారత్ తో కయ్యానికి కాలు దువ్వుతున్న చైనాకు చెక్ పెట్టడమే లక్ష్యంగా ఏర్పాటైంది క్వాడ్. మోదీ అమెరికా పర్యటన సందర్భంగా క్వాడ్ సభ్య దేశాల సదస్సు జరగనుంది. మోదీతో ఆస్ట్రేలియా ప్రధాని డేవిడ్ ఆల్బనీస్ భేటీ కానున్నారు. ఈ సందర్భంగానే ఆస్ట్రేలియాలో భారత పౌరుల గూఢచర్యం అంశం ప్రస్తావనకు రానుందని చెబుతున్నారు. నాలుగేళ్ల కిందట చైనాతో విభేదించే ఆస్ట్రేలియా.. భారత్ తో బాగానే ఉంటుంది. ఇరు దేశాల మధ్య సంబంధాలు బలంగా ఉన్నాయి. అయితే, నాలుగేళ్ల కిందట ఆస్ట్రేలియాలో గూఢచర్యం ఆరోపణలతో ఇద్దరు పౌరులను బహిష్కరించారు. అయితే, ఇది ఏప్రిల్ లో బయటకు వచ్చింది. రక్షణ ప్రాజెక్టులు, విమానాశ్రయ భద్రతకు సంబంధించిన సున్నితమైన నిఘా సమాచారాన్ని సేకరించారని వీరిలో ఇద్దరిపై ఆరోపణలు వచ్చాయి. వీరు ఆస్ట్రేలియాలో స్థానికుల్లా పనిచేస్తూ గూఢచర్యానికి పాల్పడుతున్నారని అభియోగం మోపారు. ఈ విదేశీ ఏజెంట్లు ఏ దేశానికి చెందినవారో మాత్రం బయటకు వెల్లడించలేదు. ఆస్ట్రేలియా మీడియా మాత్రం భారత్ తో సంబంధం ఉన్నవారిగా పేర్కొంది. ఆ దేశ ప్రభుత్వం వీటిని ధ్రువీకరించలేదు. అలాగే కొట్టిపారేయలేదు. విదేశీ జోక్యాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని మాత్రం ప్రకటించింది. %ూశ్రీంశీ =ఝుఃు% – నీకు పదిహేను వేలు.. నీకు పదిహేను వేలు... టీడీపీ మంత్రి ! ఆసీస్ ప్రధాని ఏమన్నారంటే.. క్వాడ్ సదస్సుకు హాజరైన సందర్భంలో భారత్ ను దీనిపై నిలదీస్తారా? అంటూ ఇటీవల ఆసీస్ ప్రధాని ఆల్బనీస్ ను మీడియా ప్రశ్నించింది. 'మా గడ్డపై ఇలాంటి పనులు మానుకోండి. ఇలాంటి వాటికి దూరంగా ఉండండి' అని మోదీకి చెబుతారా కోరింది. దీంతో భారత గూఢచారుల బహిష్కరణ అంశంపై ఆల్బనీస్ ఒక వ్యాఖ్య చేశారు. ఇలాంటి అంశాలను ప్రైవేటుగా చర్చిస్తామని చెప్పారు. "గూఢచర్యానికి సంబంధించిన అంశాలను వ్యక్తిగతంగా మాట్లాడతా. అలాంటి అంశాలను దౌత్యమార్గాల ద్వారా చర్చించాలి. నేను ఈ విధానాన్నే కొనసాగిస్తా" అని ఆల్బనీస్ వ్యాఖ్యానించారు. %ూశ్రీంశీ =ఝుఃు% – మోడీ గారూ జోక్యం చేసుకోండి... జగన్ లేఖ "దౌత్యపరంగా ముందుకెళ్లడం, ఈ అంశంపై చర్చించడం వంటి పనులను చేయగలను. దీనిపై చర్చ జరుగుతుందని చెప్పగలను. భారత్, ఆస్ట్రేలియాది చాలా పటిష్ఠ బంధం. సమగ్ర ఆర్థిక భాగస్వామ్యంపై పరస్పర ఏకాభిప్రాయం కోరుకుంటున్నాం. మోదీతో దీని గురించి నేను చర్చిస్తా. రెండు దేశాల మధ్య మరింత బలమైన ఆర్థిక సంబంధాలు ఉన్నాయి" అని ఆల్బనీస్ చెప్పారు. ఆస్ట్రేలియాలో గూఢచర్యమా? చైనా, పాకిస్థాన్ లో భారత్ గూఢచర్యం చేసిందంటే నమ్మొచ్చు. కెనడాలోనూ ఖలిస్థాన్ వాదులను అడ్డుకోవడానికి భారత్ తమ ప్రయత్నాలను సాగించిందనే ఆరోపణలు వచ్చాయి. కెనడా ప్రధాని ట్రూడోనే ఈ ఆరోపణలు చేశారు. ట్రూడో ఆరోపణల తర్వాత భారత్, కెనడాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. భారత్ మాత్రం వాటిని గట్టిగా ఖండించింది. అయితే, ఆస్ట్రేలియాలో గూఢచర్యం చేసిందంటే మాత్రం ఆశ్చర్యంగా ఉంది.

# గిన్నిస్ బుక్ లోకి ఎక్కిన మెగాస్టార్ చిరంజీవి...

- మొదటి పేజీ తరువాయి
మూవ్స్ చేసినందుకు గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లో మెగాస్టార్ చిరంజీవి పేరు నమోదైంది. ఇవాళ హైదరాబాదులోని ఐటీసీ కోహినూర్ హెూటల్ లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రకటన కార్యక్రమం జరిగింది.
ఈ కార్యక్రమానికి చిరంజీవి, గిన్నిస్ బుక్ ప్రతినిధులు, బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్ ఖాన్, టాలీవుడ్ ప్రముఖులు, మెగా కుటుంబ సభ్యులు, ఇతర రంగాలకు చెందినవారు హాజరయ్యారు. బాలీవుడ్ నటుడు ఆమిర్ ఖాన్ చేతుల మీదుగా గిన్నిస్ రికార్డు సర్టిఫికెట్ అందుకున్న చిరంజీవి... అనంతరం మాట్లాడుతూ, నేను ఎదురు చూడని గొప్ప గౌరవం ఇది అని అభివర్ణించారు.
నటన మీద కన్నా డాన్స్ మీద నాకున్న ఇష్టమే ఈ గిన్నిస్ అవార్డు రావడానికి కారణం అనుకుంటా అని వివరించారు. "చిన్నప్పటి నుంచి నేను డాన్స్ లు చేయడం అనేది నాకు ఎక్స్ ట్రా క్వాలిఫికేషన్ అయ్యింది. కొరియోగ్రాఫర్స్ వల్ల కూడా నా డాన్స్ లకు ప్రత్యేకత వచ్చింది. నటనకు అవార్డ్స్ వస్తాయి... కానీ ఈ రకంగా నా డాన్స్ లకు కూడా రికార్డు, అవార్డు వచ్చినందుకు సంతోషంగా ఉంది. ఈ విజయంలో నా దర్శకనిర్మాతలు అభిమానుల పాత్ర మరువలేనిది" అని వివరించారు.

# ఇరాన్ బొగ్గు గనిలో పేలుడు.. 30 మంది కార్మికులు దుర్మరణం

- మొదటి పేజీ తరువాయి
అధికారులు.. గాయపడ్డ కార్మికులను స్థానిక ఆసుపత్రులకు తరలించారు. బొగ్గు గని టన్నెల్ లో కార్మికులు పనిచేస్తుండగా అకస్మాత్తుగా పేలుడు సంభవించిందని సమాచారం. మీథేన్ గ్యాస్ లీక్ కావడమే పేలుడుకు దారి తీసిందని గాయపడ్డ కార్మికులు చెబుతున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో గనిలో పెద్ద సంఖ్యలో కార్మికులు పనిచేస్తున్నారని అధికారులు తెలిపారు. మరికొంతమంది కార్మికులు లోపల చిక్కుకుపోయారని అనుమానం వ్యక్తం చేశారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, లోపల చిక్కుకున్న కార్మికులను క్షేమంగా బయటకు తీసుకొస్తామని అధికారులు తెలిపారు. ప్రమాదం జరిగిన బొగ్గు గని ఇరాన్ రాజధానికి సుమారు 540 కిలోమీటర్ల దూరంలోని తబాస్ లో ఉంది. కాగా, ఇరాన్ లో గతంలోనూ బొగ్గు గని ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. 2017లో ఓ బొగ్గు గనిలో జరిగిన పేలుడుకు 42 మంది కార్మికులు బలయ్యారు. 2013లో రెండు గనులలో జరిగిన ప్రమాదాలలో 11 మంది, 2009లో జరిగిన మరో ప్రమాదంలో 20 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు.

# నీ ముఖంలో కొంచెమైనా బాధ కనిపించిందా జగన్?

**పెన్ పవర్ డెస్క్:** తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మీడియా సమావేశం నిర్వహించారు. జగన్ రెడ్డి హిందూ ద్రోహి అని మండిపడ్డారు. పరమ పవిత్రమైన పుణ్యక్షేత్రంలో ఘోరమైన పాపం చేశారని ధ్వజమెత్తారు. ఇంత జరిగినా నీ ముఖంలో కొద్దిగానైనా బాధ ఉందా జగన్? అయ్యో, ఎంత పాపం జరిగిందని ఒక్కసారైనా అనిపించిందా? అని ప్రశ్నించారు.
జగన్ ఐదేళ్ల పాలనలో ఎన్నో ఆలయాలు కూల్చేశారని, రామతీర్థంలో రాములవారి విగ్రహాన్ని ధ్వంసం చేశారని పట్టాభి పేర్కొన్నారు. ఘోరమైన పాపం జరిగితే చాలా తేలిగ్గా మాట్లాడుతున్నాడు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.
"మీడియా ముందుకు వచ్చి ఏం మాట్లాడుతున్నావయ్యా నువ్వు! ఇది కామన్ గా జరుగుతుంటుందండీ అని క్యాజువల్ గా చెబుతావా? హిందూ మతం పట్ల నీకున్న ద్వేష భావాన్ని నీ ఐదేళ్ల పాలనలోనే చూశాం కదయ్యా! నీ పాలనలో ఆలయాలు ధ్వంసం చేస్తుంటే కట్టడి చేశావా, దోషులను శిక్షించావా? తాడేపల్లి కొంపలో కూర్చుని పైశాచిక ఆనందం పొందావు. అందుకే నువ్వు హిందూ వ్యతిరేకివి" అంటూ పట్టాభి విమర్శనాస్త్రాలు సంధించారు.

# బంగాళాఖాతంలో మరో అల్పపీడనం.. ఏపీ, తెలంగాణకు వారం పాటు వర్షాలు

- మొదటి పేజీ తరువాయి
ఈ రెండు సర్క్యులేషన్లు అల్పపీడనానికి దారితీస్తాయని అంచనా వేసింది. దీని ఫలితంగా తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్ర, యానాంలలో వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ నెల 23 (సోమవారం) న ఆంధ్రప్రదేశ్, యానాంలో, 23 నుంచి 25 వరకు తెలంగాణలో, 24, 25న రాయలసీమలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఉపగ్రహ అంచనాల ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం నుంచి తెలుగు రాష్ట్రాలు మేఘావృతం అయి ఉంటాయని చెప్పారు. సాయంత్రం 5 గంటల తర్వాత రెండు రాష్ట్రాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని వివరించారు. హైదరాబాద్ లో సాయంత్రం నుంచి రాత్రి వరకు మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందన్నారు.

# ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్

- మొదటి పేజీ తరువాయి
శ్రీకారం చుట్టారు. ఈ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పదకొండు రోజుల పాటు దీక్ష కొనసాగించి పవన్ కల్యాణ్ తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారు. దీక్ష చేపట్టిన తర్వాత ఆలయ ప్రాంగణంలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఏ మతమైనా భక్తుల మనోభావాలు దెబ్బతినకూడదని చెప్పారు. ఏ మతంలో ఇలాంటి ఘటనలు జరిగినా తాము పోరాడతామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఆలయాలను అపవిత్రం చేశారని, రథాలను తగలబెట్టారని ఆరోపించారు. రాముడి విగ్రహం తల తొలగిస్తే నాడు పోరాడిన విషయాన్ని పవన్ కల్యాణ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రసాదాల కల్తీ, నాణ్యత లేమి గురించి గతంలోనే చెప్పామన్నారు.

**పూజా విధానాలనే మార్చేశారు..**

వైసీపీ పాలనలో తిరుమల శ్రీవారి పూజా విధానాలనే మార్చేశారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మండిపడ్డారు. 2019 నుంచి తిరుమలలో నాటి ప్రభుత్వం చాలా మార్పులు చేసిందన్నారు. శ్రీవాణి ట్రస్టు పేరుతో రూ.10 వేలు వసూలు చేసి బిల్లు మాత్రం రూ.500కే ఇచ్చారని ఆరోపించారు. శ్రీవారి మహాప్రసాదంగా భావించే లడ్డూను కూడా కల్తీ చేయడం తీవ్ర ఆవేదన కలిగిస్తోందన్నారు. దోషులకు శిక్ష పడాల్సిందేనని స్పష్టం చేశారు. ఇంత అపవిత్రం చేసినా మాట్లాడకుండా ఉండాలా అని ప్రశ్నించారు. వేదన కలిగినప్పుడు పోరాడతామని, ఏ మతంపై దాడి జరిగినా ఇలాగే స్పందిస్తామని ఆయన తేల్చిచెప్పారు. ఈ విషయంపై క్యాబినెట్ భేటీ, అసెంబ్లీలో దీనిపై చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఇంత ఘోరం జరుగుతుంటే సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి ఏం చేశారని నిలదీశారు. తప్పులు చేసినవారిని జగన్ ఎలా సమర్థిస్తారని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు.

# డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తో టీటీడీ ఈవో శ్యామలరావు భేటీ

- మొదటి పేజీ తరువాయి
క్యాంపు కార్యాలయంలో కొద్దిసేపు సమావేశమయ్యారు.
ఈ సందర్భంగా, తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగంపై పవన్ కల్యాణ్ ఆరా తీశారు. గత పాలకమండలి హయాంలో లడ్డూ తయారీలో కల్తీ జరిగినట్టు ఈవో శ్యామలరావు వివరించారు. గత పాలక మండలి హయాంలో నెయ్యి సరఫరాదారును ఎంపిక చేసిన ప్రక్రియను, ల్యాబ్ పరీక్షల్లో వెల్లడైన ఫలితాలను తెలియజేశారు. టీటీడీ తరఫున సంప్రోక్షణ చర్యల వివరాలను ఆయన పవన్ కు తెలియజేశారు. కల్తీ నెయ్యి వినియోగానికి అనుమతించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పవన్ పేర్కొన్నారు. భక్తుల మనోభావాలను పరిరక్షించే విషయంలోనూ, ధార్మిక అంశాల అమలులోనూ రాజీ పడొద్దని స్పష్టం చేశారు

# త్వరలోనే నామినేటెడ్ పోస్టుల భర్తీ...

- మొదటి పేజీ తరువాయి
లేకపోయినప్పటికీ ప్రభుత్వ యంత్రాంగాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకుంటున్నాం.

- గత అసమర్థ పాలనతో ప్రభుత్వంలోని పలు విభాగాలు గాడితప్పాయి. వాటిని సరిదిద్దుతున్నాము. పెండింగ్ బిల్లులను విడుదల చేస్తూ ముందుకు పోతున్నాం.
- మనది ప్రజా ప్రభుత్వం... ఆర్భాటాలు లేవు.
- 100 రోజుల్లో ఏం చేశామో ప్రజలకు చెప్పండి. నేతలు ఇంటింటికీ వెళ్లాలి. గ్రామ, వార్డు సచివాలయాలతో పార్టీ ప్రజాప్రతినిధులు సమన్వయం చేసుకోవాలి.
- న్న చారిత్రాత్మక విజయం అందించిన ప్రజలకు మనం సంక్షేమం, అభివృద్ధి అందించాలి.

# వాస్తవాలు నిగ్గు తేల్చాలి..

- మొదటి పేజీ తరువాయి
తిరుమల సంప్రదాయాలపై అపోహలు పెంచే విధంగా ప్రచారం చేస్తున్నారని వివరించారు. ఇది ఎంతో సున్నితమైన అంశం అని, దీన్ని రాజకీయాల కోసం వాడుకుంటున్నారని జగన్ తన లేఖలో విమర్శించారు. చంద్రబాబు తన రాజకీయ అవసరాల కోసం ముఖ్యమంత్రి పదవికి అప్రదిష్ఠ తెచ్చేలా వ్యవహరిస్తున్నారని, టీటీడీ ప్రతిష్ఠను దిగజార్చిన చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలని ప్రధాని మోదీని కోరారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని సీఎం చంద్రబాబును ఆహ్వానించిన టీటీడీ

- మొదటి పేజీ తరువాయి
ఈ నేపథ్యంలో, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు, అర్చకులు నేడు అమరావతిలో సీఎం చంద్రబాబును కలిసి... శ్రీవారి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ఆహ్వానించారు. ఇవాళ ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసానికి వచ్చిన టీటీడీ ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి సీఎం చంద్రబాబుకు ఆహ్వాన పత్రిక అందించారు. ఈ సందర్భంగా అర్చకులు, వేదపండితులు చంద్రబాబుకు వేదాశీర్వచనం ఇచ్చి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా టీటీడీ అధికారులకు, అర్చకులకు సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు.

# జగన్ ఇంటి వద్ద ఉద్రిక్తత.. జై శ్రీరామ్ అంటూ నినాదాలు



తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం వివాదం రోజురోజుకూ ముదురుతోంది. లడ్డూ ప్రసాదంలో అపచారం చోటుచేసుకున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం చెబుతుండడంతో అన్నివర్గాల్లోనూ ఆగ్రహం కనిపిస్తోంది. దోషులను వదలకుండా.. మరోమారు ఇలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఈ దుర్ఘటనపై ప్రపంచవ్యాప్తంగా హిందూలోకం గొంతెత్తుతోంది. తిరుమల దేవస్థానాన్ని అపవిత్రం చేశారని.. తిరుమల గొప్పతనాన్ని దెబ్బతీశారని నిలదీస్తున్నారు. రాజకీయ పరంగానూ అన్ని పొలిటికల్ లీడర్ల నుంచి వాయిస్ వినిపిస్తోంది. తాజాగా.. బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలు ఒక్కసారిగా భగ్గుమన్నారు. %ూశ్రీంశీ =ఝుఃు% – పారో.. ఆ 50 మంది డేర్ డెవిల్స్ తప్ప ఎవరూ విమానం నడపలేరో.. తాడేపల్లిగూడెంలోని మాజీముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నివాసాన్ని ముట్టడించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన కార్యకర్తలతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు కనిపించాయి. దాంతో పోలీసులు వారిని కట్టడి చేసేందుకు ఇబ్బందులు పడ్డారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన కార్యకర్తలు జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసనకు దిగారు. పోలీసులు వారిని అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్ కు తరలించారు. కాగా.. ఇప్పటికే లడ్డూ ప్రసాదం వివాదంపై బీజేపీ నేతలు ఒక్కొక్కరుగా స్పందిస్తున్నారు. తెలంగాణకు చెందిన కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. సరైన విధంగా విచారణ జరిపించి.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. అటు.. అగ్రనేత అమిత్ షా కూడా ఈ అంశంపై రియాక్ట్ అయ్యారు. తాజాగా.. జగన్ నివాసాన్ని ముట్టడించారు.

# వెకేషన్ @ విదేశం.. వీసా లేకుండా ఈ దేశాలకు వెళ్లొచ్చు

విజయ్‌కి కొత్త ప్లేస్‌లంటే చాలా ఇష్టం. తను చేసే జాబ్ నుంచి ఫ్రీ టైం దొరికినప్పుడల్లా టూర్లకు వెళ్తుంటాడు. శ్రీజకి ఇన్‌స్టాగ్రామ్‌లో అందమైన చోటు కనిపిస్తే చాలు.. వెంటనే అక్కడికి వెళ్లి ఫొటోలకు పోజులిస్తుంటుంది. ఫ్యామిలీతో కలిసి టూర్ వెళ్లాలనుకునే రంజిత్.. ఇంట్లో వాళ్లు ప్లాన్ చేయగానే లాంగ్ లీవ్ పెట్టి మరీ వెళ్తుంటాడు. అయితే, వీళ్ల ముగ్గురి వ్యక్తిత్వాలు, చేసే ఉద్యోగాలు వేరైనా.. టూర్ విషయంలో వాళ్ల ఆలోచన మాత్రం ఒకటే. ఎందుకంటే ఎలాగూ కొత్త ప్రదేశానికి వెళ్లాలనుకుంటున్నాం.

అలాంటప్పుడు అదే ఖర్చుతో కొత్త దేశానికి వెళ్తే బాగుంటుంది కదా! అనేది వీళ్ల ఆలోచన. ప్రస్తుతం చాలామంది ఆలోచన కూడా ఇదే. ఎక్కడికైనా దూరంగా వెళ్లిపోవాలి అనిపిస్తుంటుంది. వెకేషన్, పిక్నిక్, టూర్, ట్రిప్.. పేర్లు ఏవైనా గానీ ఓ సరదా ప్రయాణం వెలకట్టలేని సంతోషాన్నిస్తుంది. మరపురాని జ్ఞాపకాలను అందిస్తుంది. మనసుకు ప్రశాంతతను ఇస్తుంది. అందుకే.. టైం దొరికితే ఏడాదికి ఒకసారైనా టూర్‌కి వెళ్లమని చెప్పేవాళ్లు ఎక్స్‌పర్ట్స్. అయితే ఇది గతంలో మాట. ఇప్పుడు... ట్రెండ్ మారింది. టైం కేటాయించుకుని మరీ టూర్‌లకు వెళ్తున్నారు చాలామంది. సోలో ట్రిప్, ఫ్రెండ్స్ టూర్, ఫ్యామిలీ వెకేషన్.. ఇలా రకరకాల పేర్లతో ఏడాదికి మూడు లేదా నాలుగు సార్లు వెళ్లేవాళ్లు కూడా ఉన్నారు. అయితే, ప్రపంచ దేశాల పర్యాటకులు ఒక ఎత్తు. భారతీయులు మరో ఎత్తు అనేలా ఉంది ఇప్పుడు పరిస్థితి. దానికి కారణం భారతీయులు టూర్ కోసం ఎక్కువగా ఖర్చు చేస్తున్నారు. పైగా విదేశాలకు టూర్‌లు వేసేవాళ్లు ఎక్కువని రిపోర్ట్‌లు చెప్తున్నాయి. మరి మనవాళ్లు టూర్ అంటే ఎందుకు విదేశాలకే ఓటు వేస్తున్నారు అనేది తెలుసుకోకపోతే ఎలా? మనదేశంలోని టూరిస్ట్ ప్లేస్‌లు ఎప్పుడూ పర్యాటకులతో కళకళలాడుతుంటాయనే విషయం తెలిసిందే. కాకపోతే చాలా వరకు ఆధ్యాత్మిక ప్రదేశాలు కావడంతో మధ్య వయసు నుంచి వృద్ధుల వరకు ఫ్యామిలీలతో కలిసి వెళ్తుంటారు. అయితే, ఇప్పుడు అలా లేదు. కొవిడ్–%–%19 తర్వాత యువతలో కూడా ట్రావెల్‌పై ఆసక్తి పెరిగింది. ఇండియాలో టూరిస్ట్ ప్లేస్‌లకు వెళ్లడమే కాకుండా విదేశాలకూ వెళ్లేందుకు చాలామంది ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. అయితే... ఐదేండ్ల ముందు అంటే 2018%–%2019లలో ఒక నెలకు విదేశీ టూరిజం ఖర్చు 3,300 కోట్లు. కాగా దానితో పోలిస్తే 2023%–%2024 డేటా షాక్‌కి గురిచేస్తోంది.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఇటీవల విడుదల చేసిన ఒక రిపోర్ట్ ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరంలో విదేశీ ప్రయాణాల కోసం భారతీయులు చేస్తున్న ఖర్చు రూ. 12,500 కోట్లు అని తెలిసింది. అది ఒక్క నెలకు మాత్రమే కావడం గమనార్హం! ఈ లెక్కలు చాలు.. మనవాళ్లకు ప్రయాణాలు అంటే ఎంత ఇష్టమో చెప్పడానికి. వయసు భేదం లేకుండా అందరూ విదేశీ టూర్లకు వెళ్లడం వెనుక కారణాలేంటి? అని ఒకసారి పరిశీలిస్తే.. ఆసక్తికర విషయాలు తెలిశాయి. ప్రధాన కారణాలు ఇవే.

### వీసా ఇబ్బంది లేదు

విదేశాలకు వెళ్లాలంటే వీసా ఉండాలని తెలిసిందే. కానీ, కొన్ని దేశాలకు వీసా అవసరం లేదు అనే విషయం చాలామందికి తెలియదు. ఆ విషయంపై ఈ మధ్యకాలంలో అవగాహన పెరిగింది. దాంతో దూరదేశమైనా వీసా తలనొప్పులు లేకుండా వెళ్లిరావొచ్చు అనే ధీమా వచ్చింది. పైగా ఇతర దేశాన్ని చూసొచ్చామనే సంతృప్తి ఉంటుంది. అందుకే విదేశాలకు వెళ్లాలనుకుంటారనేది మొదటి రీజన్.



### జర్నీ.. కొన్ని గంటలే

ఇతర దేశాలంటే కొన్ని వేల కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తుందని అనుకుంటారు. అయితే మన దేశానికి దగ్గర్లో ఉన్న దేశాలకు వెళ్లడానికి ఎక్కువ టైం ప్రయాణం చేయాల్సిన అవసరం లేదు. రోజులో ఒక పూట జర్నీ చేసినా చాలు.. గమ్యస్థానానికి చేరుకోవచ్చు. ఈ కారణం చేత కూడా చాలామంది విదేశీ పర్యటనలు చేయాలనుకుంటున్నారు.

### తక్కువ ఖర్చుతో..

టూర్‌లకు వెళ్లినప్పుడు ప్రయాణ ఖర్చుల కంటే అక్కడ ఉన్నన్ని రోజులు స్టే చేయడానికే ఎక్కువ ఖర్చు చేయాల్సివస్తుంది. దాంతో దూర ప్రాంతాలకు వెళ్తే అక్కడ సేఫ్టీ, సెక్యూరిటీ ఉండాలి అనే ఆలోచనతో లగ్జరీ స్టే కోరుకోవడం సహజం. అయితే, లగ్జరీ అంటే ఖర్చుతో కూడిన విషయం కాబట్టి అసలు ఇతరదేశాలకు వెళ్లడం మీద ఆసక్తి చూపేవాళ్లు కాదు. కానీ, దగ్గర్లో ఉండే దేశాలకు వెళ్లడం వల్ల ఇది కూడా ఒక బెనిఫిట్. కజకిస్తాన్ వంటి దేశాల్లో హొటల్‌లో స్టే చేయడానికి రెండు వేల నుంచి చార్జీలు మొదలవుతాయి. కాబట్టి ఖర్చు తగ్గే పని అంటే ఎంతదూరమైనా వెళ్లడానికి సిద్ధపడతారు మనవాళ్లు.

### సినిమాల ప్రభావం!

ఇండియన్స్ మూవీ లవర్స్ అనే విషయం ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అయితే, ఇండియన్ టూరిస్ట్‌ల మీద సినిమాల ప్రభావం ఉంటుందని తేలింది. అందుకు ఇవే ఉదాహరణలు.. బాలీవుడ్ సినిమా 'జిందగీ నా మిలేగీ దొబారా'లో స్పెయిన్ లొకేషన్స్ కనిపిస్తాయి. ఆ సినిమా ప్రభావం వల్ల 2011లో వీసా నిబంధనలు ఉన్నప్పటికీ 40 శాతం టూరిస్ట్‌ల సంఖ్య పెరిగింది. అలాగే, యాభై ఏండ్లుగా సినిమాల్లో స్విట్జర్లాండ్ లొకేషన్స్ ఎక్కువగా చూస్తున్నారు ఆడియెన్స్. సినిమాల్లో చూసిన లొకేషన్స్‌ని రియల్ లైఫ్‌లో ఎక్స్‌పీరియెన్స్ చేయాలనే ఉద్దేశంతో చాలామంది స్విట్జర్లాండ్ వెళ్తున్నట్టు తెలిసింది. అంతేకాదండోయ్.. స్విస్ టూరిస్ట్ బోర్డ్ బాలీవుడ్ టూర్స్ పేరుతో ఆయా ప్రాంతాలకు కూడా వెళ్లే అవకాశం కల్పిస్తోందట. అంతేకాదు.. స్టార్ హీరోలు ఆయా దేశాల టూరిజం ప్రమోషన్లలో భాగం కావడం కూడా టూరిస్ట్‌లను ప్రభావితం చేయొచ్చు.


### ప్రజెంట్ సిచ్యుయేషన్ ఇది

ఇండియాలో ఏటా ఎక్కువ ఇంటర్నేషనల్ టూర్స్‌కి వెళ్లేవాళ్ల సంఖ్య గతంతో పోలిస్తే 32 శాతం పెరిగింది. మహారాష్ట్ర, కర్నాటక, ఢిల్లీ టాప్‌లో ఉన్నాయి. అందులోనూ యూకే, ఆస్ట్రేలియా, జర్మనీ వంటి దేశాలు స్టూడెంట్స్ ఎక్కువగా ఎంచుకుంటున్నారు. యునైటెడ్ నేషన్ వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్ ప్రకారం ప్రతి ఏటా దాదాపు 50 మిలియన్ల మంది ఇండియన్స్ విదేశాలకు వెళ్తున్నారు. విదేశంలో అందమైన ప్రదేశాలు, చరిత్ర, వన్యప్రాణులు, కల్చర్, వెరైటీగా అనిపించే లోకల్ ఫుడ్, అడ్వెంచర్స్ వంటి వాటికి అట్రాక్ట్ అవుతున్నారు. మనదేశంలో ఇలాంటివన్నీ ఉన్నప్పటికీ ఇతర దేశాల్లో వాటిని ఎక్స్‌పీరియెన్స్ చేయాలనే కోరిక ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో టూరిస్ట్‌లను ప్రభావితం చేసే కారణాలు ఏవంటే...

గతంలో అది సినిమాల ప్రభావం అనుకున్నా.. ఇప్పుడు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్స్ పెరిగింది. చాలామంది బయటి దేశాలు వెళ్లి అక్కడ ఫొటోలు, వీడియోలు తీసుకుని సోషల్ మీడియాలో పోస్టులు చేస్తుంటారు. దీంతో చూసేవాళ్లకు కూడా అక్కడికి వెళ్లాలనే ఇంట్రెస్ట్ ఆటోమెటిక్‌గా కలుగుతుంది.


మనదేశంలోని ఏదైనా టూరిస్ట్ ప్లేస్‌కి వెళ్లి అక్కడ లగ్జరీ హొటల్‌లో రూం బుక్ చేసుకోవాలంటే ఖరీదు చాలా ఎక్కువ. దానికి పెట్టే ఖర్చుతో ఒక విదేశం చూసి రావొచ్చు అనుకుంటారు. ఆ కారణంగా బడ్జెట్ ఫ్రెండ్లీగా ఉండే విదేశాలకు వెళ్లేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు చాలామంది. ఇందులో ఎక్కువగా పంజాబ్, పశ్చిమ బెంగాల్, గుజరాత్, తమిళనాడు వాళ్లు బడ్జెట్ సెలక్షన్ వైపు మొగ్గుచూపుతున్నారు. అడ్వెంచర్స్ చేసేవాళ్లకు సేఫ్టీ చాలా ముఖ్యం. ఈ విషయంలో ఇండియన్ టూరిస్టులు ఇతరదేశాల వైపే మొగ్గుచూపుతున్నారు. మనదేశంలో స్కీయింగ్, బంగీ జంపింగ్, స్కై డైవింగ్, పారా సెయిలింగ్ వంటివి చేయాలంటే సరైన భద్రతా చర్యలు తీసుకుంటున్నారో లేదోనని డౌట్ పడుతున్నారు. క్వీన్స్ టౌన్, సౌత్ ఆఫ్రికా దేశాలు ఇలాంటి అడ్వెంచర్స్‌కు బెస్ట్ అని నమ్ముతున్నారు.

# మరో రెండు గంటల్లో హైదరాబాద్‌లో వర్షం



బంగాళాఖాతంలో రెండు అల్పపీడన ఆవర్తనాలు కొనసాగుతున్న క్రమంలో తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. హైదరాబాద్ లో నగరంలో కూడా వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తోంది. ఆదివారం ఉదయం నుంచి హైదరాబాద్ లో వాతావరణం మేఘావృతంగా ఉంది. ఆదివారం సాయంత్రానికి హైదరాబాద్ సిటీలో పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది.అయితే రానున్న రెండు గంటల్లో మరోసారి హైదరాబాద్ సిటీలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.. సిటీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తోంది.


# ఇదెక్కడి పిచ్చిరా ... రీల్స్ కోసం పాడుబడ్డ బావిపై బిడ్డ ప్రాణాలు



ఈ రోజుల్లో జనాలు రాత్రికి రాత్రే పాపులర్ అవ్వాలనుకుంటున్నారు. దానికోసం పిచ్చి చేష్టలు,, వెర్రి చేష్టలు చేయడం.. సోషల్ మీడియాలో పోస్ట్ చేసి వైరల్ అవ్వాలని కోరుకుంటున్నారు. ఆ వీడియోలు చేయడం రిస్కయినా.. ప్రాణం మీదకు వస్తాయని తెలిసినా జనాలు వెనుకాడటం లేదు. వారి ప్రాణాలే కాదు. ఇతరుల ప్రాణాలను కూడా పణంగా పెట్టి వీడియోలు చేస్తున్నారు. వైరల్ వ్యామోహంలో పడిన ఓ మహిళ పాపులారిటీ కోసం చిన్నారిని అజాగ్రత్తగా పట్టుకొని పాడుబడ్డ బావిలో స్టంట్స్ చేయడం సోషల్ మీడియా రీల్ కోసం ప్రయత్నించడం కనిపించింది. .ఈ వీడియో చూసిన వారు షాక్ అయ్యారు.ఓ తల్లి రీల్స్ మోజులో .. పాడుబడ్డబావిపై కూర్చొని .. చిన్నారిని బావిలో ఉంచి పట్టుకొని పాటలు పాడుతూ ఎంజాయి చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియోను చూసిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్ స్పందించారు. సోషల్ మీడియా పాపులారిటీ కోసం.. పిచ్చి పిచ్చి వేషాలు వేస్తూ.. పిల్లల ప్రాణాలను రిస్క్ పెట్టడం..ఎంతవరకు సమంజనం.. తేడా వచ్చిందా.. ఆ చిన్నారి ప్రాణాలకు ప్రమాదం వాటిల్లుతుందనే సోయి లేదు.. వెర్రి వేషాలు వేస్తూ.. ఫేమస్ కోసం సోషల్ మీడియాకు బానిసలు కాకండి.. అంటూ సజ్జనార్ వీడియో షేర్ చేశారు.

# ఆర్మీ ప్రత్యేక రైలుని పేల్చివేసే కుట్ర... ట్రాక్‌పై 10 డిటోనేటర్ల గుర్తింపు

- మధ్యప్రదేశ్‌లో వెలుగుచూసిన షాకింగ్ ఘటన
- ఆర్మీ సిబ్బంది ప్రయాణించిన రైలును లక్ష్యం ఎంచుకున్న దుండగులు
- ఉత్తరప్రదేశ్‌లో రైల్వే ట్రాక్‌పై గ్యాస్ సిలిండర్ గుర్తింపు
- వరుసగా వెలుగుచూస్తున్న కుట్రలు



దేశంలో ఇటీవల రైలు ప్రమాదాలకు కుట్రలు పన్నుతున్నట్టు అనుమానాలు కలిగించేలా వరుస ఘటనలు వెలుగుచూస్తున్నాయి. తాజాగా దిగ్భ్రాంతి కలుగజేసే మరో పన్నాగం బయటపడింది. ఆర్మీ సిబ్బందితో వెళుతున్న ప్రత్యేక రైలును పేల్చివేసే కుట్ర జరిగింది. రైల్వే ట్రాక్‌పై ఏకంగా 10 డిటోనేటర్లను దుండగులు అమర్చారు. అయితే అదృష్టం కొద్దీ ఎలాంటి నష్టం జరగకుండానే కుట్రం భగ్నమైంది. మధ్యప్రదేశ్‌లోని బుర్హాన్‌పూర్ జిల్లాలో బుధవారం ఈ ఘటన జరిగింది. సైన్యానికి చెందిన ప్రత్యేక రైలు జమ్మూ కశ్మీర్ నుంచి కర్ణాటకకు వెళుతున్న సమయంలో సగ్‌ఫటా రైల్వే స్టేషన్ సమీపంలో డిటోనేటర్లను గుర్తించారు. ఒక డిటోనేటర్ పేలడంతో డ్రైవర్ వెంటనే అప్రమత్తమై ట్రైన్‌ను ఆపాడు. దీంతో పెనుప్రమాదం తప్పింది.

డ్రైవర్ వెంటనే స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందించాడు. యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్), నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ), రైల్వే, స్థానిక పోలీసు సీనియర్ అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. ఈ ఘటనపై దర్యాప్తు మొదలుపెట్టారు. కాగా ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని అధికారులు తెలిపారు.

### రైల్వే ట్రాక్‌పై గ్యాస్ సిలిండర్

ఉత్తరప్రదేశ్‌లో ఒక చోట రైల్వే ట్రాక్‌పై గ్యాస్ సిలిండర్‌ను రైల్వే భద్రతా సిబ్బంది గుర్తించారు. ఇవాళ (ఆదివారం) తెల్లవారుజామున రాష్ట్రంలోని కాన్పూర్‌లో ఉన్న ప్రేమ్‌పూర్ రైల్వే స్టేషన్‌కు సమీపంలో రైలు పట్టాలపై ఈ సిలిండర్‌ను గుర్తించారు. అది ఖాళీ గ్యాస్ సిలిండర్ అని నిర్ధారించారు. ట్రాక్‌పై సిలిండర్‌ను గుర్తించిన వెంటనే గూడ్స్ రైలు లోకో పైలట్ అత్యవసర బ్రేకులు వేసి ట్రైన్‌ను ఆపాడు. ఉదయం 8:10 గంటల సమయంలో ట్రైన్ కాన్పూర్ నుంచి ప్రయాగ్‌రాజ్ వైపు వెళుతున్న సమయంలో ఈ ఘటన జరిగిందని పోలీసులు వెల్లడించారు. 5 కేజీల గ్యాస్ సిలిండర్‌ను ట్రాక్‌పై ఉంచారని, ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. కాగా ఉత్తరప్రదేశ్‌లో ఈ తరహా ఘటన జరగడం ఈ నెలలో రెండవసారి కావడం గమనార్హం.

# ఆహారంలో బతికివున్న ఎలుక.. విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

**ఫుడ్ పార్శిల్ నుంచి బయటకొచ్చిన ఎలుక**

**అత్యవసరంగా ల్యాండింగ్ చేసిన విమాన సిబ్బంది**

**ఎలుకలు విద్యుత్ వైర్లను కొరికే ప్రమాదం... అందుకే ప్రత్యేక ప్రోటోకాల్**



విమాన ప్రయాణంలో ఓ ప్యాసింజర్ బాగా ఆకలి వేయడంతో ఫుడ్ పార్శిల్‌ను ఓపెన్ చేసి ఊహించని అనుభవాన్ని ఎదుర్కొంది. ఆమె అలా పార్శిల్ తెరవగానే ఫుడ్ ప్యాక్ నుంచి బతికి ఉన్న ఎలుక ఒకటి బయటకు దూకింది. దీంతో ప్రయాణికురాలు షాక్ అయింది. విషయాన్ని ఫ్లైట్ సిబ్బందికి తెలియజేయగా... వారు ప్రోటోకాల్ ప్రకారం విమానాన్ని ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. బుధవారం నాడు స్కాండినేవియన్ ఎయిర్‌లైన్స్‌కు (ఎస్ఏఎస్) చెందిన ఓ ఫ్లైట్ నార్వేలోని ఓస్లో నుంచి స్పెయిన్‌లోని మలాగాకు వెళుతుండగా ఈ ఘటన జరిగింది. విమానాన్ని డెన్మార్క్‌లోని కోపెన్‌హాగన్‌లో అత్యవసరంగా కిందికి దించారు.

విమానంలో ఎలుకలు కనిపించినప్పుడు అనుసరించాల్సిన నిబంధనల ప్రకారం అత్యవసరంగా ల్యాండింగ్ చేస్తారని స్కాండినేవియన్ ఎయిర్‌లైన్స్ ప్రతినిధి ఓస్టెయిన్ చెప్పారు. ఇలాంటి ఘటనలు చాలా అరుదుగా జరుగుతుంటాయని, అలాంటి సందర్భం ఎదురైనప్పుడు నిబంధలను కచ్చితంగా పాటిస్తామని అన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై విమానాన్ని తయారు చేసిన కంపెనీతో సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు. విమానంలోని విద్యుత్ వైర్లను కొరికివేసే ప్రమాదం ఉంటుంది కాబట్టి ప్రయాణం మధ్యలో ఎలుకలు కనిపించినప్పుడు ఈ ప్రొటోకాల్ పాటిస్తారని బీబీసీ కథనం పేర్కొంది.

కాగా విమానాన్ని కోపెన్‌హాగన్‌లో ల్యాండింగ్ చేసిన వెంటనే ఎలుకను పట్టుకునేందుకు క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఈ ఘటనపై విమానంలో ప్రయాణించిన జార్లే బోర్రెస్టాడ్ అనే ప్యాసింజర్ ఫేస్‌బుక్ వేదికగా స్పందించాడు. " మీరు నమ్మండి లేదా నమ్మకపోండి. స్కాండినేవియన్ ఎయిర్‌లైన్స్ విమానంలో నా పక్కన ఉన్న ఒక మహిళ ఫుడ్ పార్శిల్ ఓపెన్ చేయగానే అందులోంచి ఒక ఎలుక బయటకు దూకింది. విమానం మారేందుకు కోపెన్‌హాగన్ విమానాశ్రయంలో దిగాము" అని చెప్పారు. ఎలుక తన ప్యాంట్‌లోకి దూరకుండా జాగ్రత్త పడాల్సి వచ్చిందని ఆయన చెప్పారు. ఇంత జరిగినా విమానంలో ఎవరూ నోరు తెరవలేదని, అందరూ నిశ్శబ్దంగా కూర్చొని ఉన్నారని ఆయన చెప్పారు.

# తిరుమల లడ్డూ కల్తీ అంశం: జగన్ పై నిప్పులు చెరిగిన బుచ్చి రాంప్రసాద్

తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్ నేడు మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాజీ సీఎం జగన్ పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జగన్ ప్రభుత్వంలోని వ్యవస్థలన్నింటిని నాశనం చేశారని, కలియుగ దైవం వెంకటేశ్వర స్వామిని కూడా వదల్లేదని మండిపడ్డారు. 2023 ఆగస్టు3నే తాము తిరుపతి లడ్డూల నాణ్యత గురించి మాట్లాడామని వెల్లడించారు. తిరుపతి లడ్డూలో నాణ్యత లేదని, సరైన నెయ్యి వాడటంలేదని, సరైన పదార్థాలు లడ్డూలో ఉండటంలేదని ఇదే వేదిక పై సమావేశం ఏర్పాటు చేసి చెప్పామని బుచ్చి రాంప్రసాద్ వివరించారు. "గతంలో వైసీపీ ప్రభుత్వం రకరకాల కంపెనీల నుంచి ఆవు నెయ్యిని కొనుగోలు చేసింది. నెయ్యి సరఫరాలో కూడా రివర్స్ టెండరింగ్ పాలసీని అవలంబించారు. టీడీపీ హయాంలో తయారు చేసిన లడ్డూలో జీడిపప్పు, బాదం, కిస్ మిస్ లు ఎక్కువగా ఉండేవి. జగన్ హయాంలో అవి కనపడేవి కాదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో తయారవుతున్న తిరుపతి లడ్డూల్లో పెద్ద పెద్ద జీడిపప్పు, బాదం, కిస్ మిస్ కనిపిస్తున్నాయి. ఇప్పుడు నాణ్యమైన లడ్డూ తయారవుతోంది. వైసీపీ హయాంలో లడ్డూ ఎండిపోయినట్టుగా, క్రికెట్ బాల్ లాగా గట్టిగా ఉండేది. ప్రస్తుతం పట్టుకుంటేనే మృదువుగా ఉంటోంది. తిరుపతి వెంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్లినవారు ఇంటికొచ్చేదాకా నాన్ వెజ్ తినరు. కానీ, వైసీపీ హయాంలో తిరుపతి లడ్డూ తినిపించి నాన్ వెజ్ తినేలా చేశారు.

పవిత్రంగా భావించే తిరుపతి లడ్డూను అపవిత్రం చేశారు. తిరుపతి లడ్డూలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు పదార్థాలు కలుస్తున్నాయని చంద్రబాబు చెప్పినప్పుడు విని బాధపడ్డాను. బ్రాహ్మణులు నాన్ వెజ్ తినరని అందరికీ తెలుసు. జంతు కొవ్వు కలిపిన నెయ్యితో తయారైన లడ్డూలను తిన్నామని తెలిస్తే... పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. తెలియక తప్పు చేస్తే ఏ విధంగా ఆ తప్పును సరి చేసుకోవచ్చో ఆగమ శాస్త్రం తెలిసినవారిని అడుగాలి. నాన్ వెజ్ తిననివారు తెలియక తినేస్తే ఏం చేయాలో తెలుసుకొని సరిదిద్దుకోవాలి. ఆగమ శాస్త్రం తెలిసిన వారు ఏ విధంగా ఈ దోషం వదలుతుందో ప్రెస్ రిలీజ్ చేయాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతి లడ్డూను రాజకీయాలకు వాడుకుంటున్నాడని జగన్ చెప్పడం హాస్యాస్పదం. అలిపిరిలో చంద్రబాబు పెద్ద ప్రమాదం నుంచి తప్పించుకున్నప్పుడు తిరుపతి వెంకటేశ్వర స్వామి నాకు మరో జన్మ ఇచ్చారని చెప్పారు. ఆయన ఎప్పుడూ టీటీడీని రాజకీయాలకు వాడుకోలేదు. అటువంటి ఆలోచన జగన్ కే ఉంది.

# తిరుపతి లడ్డూ వివాదంపై సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు

- ఈ వ్యవహారంపై దర్యాప్తు కోసం సిట్ ఏర్పాటు చేయాలంటూ హిందూ సేన పిటిషన్
- నెయ్యిలో జంతు కొవ్వు కలిపి హిందువుల మనోభావాలను అగౌరవపరిచారన్న హిందూసేన అధ్యక్షుడు
- ఈ వ్యవహారం హిందూ సమాజాన్ని కలవర పెడుతోందని వ్యాఖ్య



వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి లడ్డూ ప్రసాదం తయారీలో జంతు కొవ్వు కలిసిన కల్తీ నెయ్యిని ఉపయోగించారని ల్యాబ్ రిపోర్టుల్లో నిర్ధారణ కావడంపై దేశవ్యాప్తంగా భక్తులు, ధార్మిక సంస్థలు మండిపడుతున్నాయి. న్యాయస్థానాల్లో వరుసగా పిటిషన్లు దాఖలవుతున్నాయి. తాజాగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ముందుకు మరొక పిటిషన్ వచ్చింది. జంతు కొవ్వు కలిసిన నెయ్యిని లడ్డూ తయారీలో ఉపయోగించారనే ఆరోపణలపై విచారణ కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. హిందూ సేన అధ్యక్షుడు, రైతు సుర్జిత్ సింగ్ యాదవ్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. టీటీడీ లడ్డూ వ్యవహారంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.లడ్డూ ప్రసాదం తయారీలో జంతు కొవ్వు కలిసిన నెయ్యిని ఉపయోగించి హిందువుల మనోభావాలను అగౌరవపరిచారని సుర్జిత్ సింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిణామం హిందూ సమాజాన్ని తీవ్రంగా కలవర పెడుతోందని అన్నారు. సాధారణ ప్రజల ప్రయోజనం కోసమే తాను ఈ పిటిషన్‌ను దాఖలు చేశానని చెప్పారు. సాధారణ పౌరులు అందరూ కోర్టు తలుపు తట్టలేకపోవచ్చని, సరిగ్గా సన్నద్ధం కాకపోవడం, ఆర్థిక పరిస్థితి అనువుగా లేకపోవడం ఇందుకు కారణాలు కావొచ్చని అన్నారు.

## బంగ్లాదేశ్‌పై గెలుపుతో చరిత్ర సృష్టించిన భారత్...

# 1932 తర్వాత ఇదే తొలిసారి

**టెస్టుల్లో 179వ విజయాన్ని అందుకున్న భారత్**

**టెస్టుల్లో ఓటముల సంఖ్యను విజయాల సంఖ్య అధిగమించడం ఇదే తొలిసారి**

**ఇప్పటివరకు 581 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి 178 సార్లు ఓడిన భారత్**



చెన్నై టెస్టులో బంగ్లాదేశ్‌పై టీమిండియా ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఏకంగా 280 పరుగుల తేడాతో గెలిచింది. ఈ విజయంతో భారత్ చారిత్రాత్మక రికార్డును సొంతం చేసుకుంది.
92 ఏళ్ల భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో తొలిసారి మొత్తం ఓటముల సంఖ్యను విజయాల సంఖ్య అధిగమించింది. బంగ్లాదేశ్‌పై దక్కింది భారత్‌కు 179వ విజయం.. కాగా 178 మ్యాచ్‌ల్లో టీమిండియా ఓటములను మూటగట్టుకుంది. కాగా టెస్ట్ ఫార్మాట్‌లో భారత్ ఇప్పటివరకు మొత్తం 581 మ్యాచ్‌లు ఆడింది. 1932లో సీకే నాయుడు కెప్టెన్సీలో భారత్ మొట్టమొదటి టెస్ట్ మ్యాచ్‌ను ఆడింది. ఆ మ్యాచ్‌లో 158 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఆ మ్యాచ్ తర్వాత ఒక్కసారి కూడా ఓటముల కంటే అధికంగా విజయాలు నమోదు కాలేదు. ఎల్లప్పుడూ ఓటముల సంఖ్యే అధికంగా ఉంటూ వచ్చాయి. 92 ఏళ్ల ఈ సుదీర్ఘ నిరీక్షణకు బంగ్లాదేశ్‌పై విజయం రూపంలో తెరపడింది.
కాగా టెస్టుల్లో ఓటముల సంఖ్య కంటే విజయాలు ఎక్కువ సాధించిన జట్ల జాబితాలో భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్ కూడా ఉన్నాయి.

**టెస్టుల్లో ఓటముల కంటే విజయాలు ఎక్కువ సాధించిన జట్లు ఇవే...**

1. ఆస్ట్రేలియా: విజయాలు– 414, ఓటములు –232
2. ఇంగ్లండ్: విజయాలు – 397, అపజయాలు –325
3. దక్షిణాఫ్రికా: గెలుపులు – 179, ఓటములు – 161
4. ఇండియా: విజయాలు– 179, అపజయాలు –178
5. పాకిస్థాన్: విజయాలు– 148, ఓటములు – 144.

# వారెవ్వా గైక్వాడ్.. సింగిల్ హ్యాండ్‌తో స్టన్నింగ్ క్యాచ్



క్రికెట్ లో గ్రేట్ క్యాచులు అందుకోవడం ఒకప్పుడు అరుదుగా చూసేవాళ్ళం. కానీ టీ20 లీగ్ లు ఎక్కువైన తరుణంలో ఒక్క క్యాచ్ మ్యాచ్ ని డిసైడ్ చేసేస్తోంది. దీంతో బ్యాటింగ్, బౌలింగ్ మీదే కాదు ఫీల్డింగ్ మీద కూడా ప్లేయర్లు ఎక్కువగా దృష్టి పెడుతున్నారు. ఈ క్రమంలో క్రికెట్ చరిత్రలో ఇప్పటివరకు నమ్మశక్యం కానీ రీతిలో క్యాచులు అందుకుంటూ అభిమానులని థ్రిల్ కి గురి చేశారు. ఐపీఎల్, బిగ్ బాష్ లీగ్ లాంటి మెగా టోర్నీలో ఒకదానికి మించి మరో క్యాచ్ ని అందుకుంటూ ఆడియన్స్ కి కిక్ ఇస్తోనే ఉన్నారు.తాజాగా అలాంటి క్యాచ్ ఒకటి దులీప్ ట్రోఫీలో నమోదయింది. ఇండియా ఏ.. ఇండియా సి మధ్య జరిగిన మ్యాచ్ లో గైక్వాడ్ నమ్మశక్యం కానీ రీతిలో క్యాచ్ అందుకొని ఔరా అనిపించాడు. పరాగ్ కవర్స్ దిశగా ముందుకొచ్చి గట్టిగా షాట్ ఆడాడు. ఈ క్యాచ్ ను గైక్వాడ్ కవర్స్ లో పరిగెడుతూ సింగిల్ హ్యాండ్ తో క్యాచ్ అందుకొని షాక్ కు గురి చేశాడు. ప్రస్తుతం ఈ క్యాచ్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఈ మ్యాచ్ విషయానికి వస్తే మొదట బ్యాటింగ్ చేసిన ఇండియా ఏ రావత్ సెంచరీ (124) తో 297 పరుగులకు ఆలౌటైంది. బదులుగా ఇండియా సి మొదటి ఇన్నింగ్స్ లో 234 పరుగులు మాత్రమే చేయగలిగింది. 82 పరుగులతో అభిషేక్ పోరెల్ టాప్ స్కోరర్ గా నిలిచాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన 286 పరుగులకు ఆలౌటైంది. 350 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇండియా సి ప్రస్తుతం 6 వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది.

# అభిమానులకు సర్ ప్రైజ్.. తెలుగు సినిమాలో వార్నర్



ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ సినిమాల్లో నటిస్తున్నట్టు కన్ఫర్మ్ అయింది. అయితే ఆ సినిమా ఏంటో ఇప్పటివరకు ఎవరికీ తెలియదు. ఈ మాజీ ఆసీస్ ఓపెనర్ ఓ తెలుగు చిత్రంలో క్యామియో రోల్ చేస్తున్నారంటూ ఇటీవల కొన్ని ఫొటోలు బయటికి వచ్చాయి. పుష్ప 2 చిత్రంలోనే ఆయన కనిపించనున్నారంటూ రూమర్లు వచ్చాయి. అయితే, పుష్ప 2లో కాకుండా వేరే చిత్రంలో వార్నర్ క్యామియో చేశారట. ఢయంగ్ హీరో నితిన్ హీరోగా ఉన్న రాబిన్‌హుడ్ చిత్రంలో డేవిడ్ వార్నర్ క్యామియో రోల్ చేశారు. రాబిన్‌హుడ్' సినిమాలోనే ఆయన నటిస్తున్నారని సినీ వర్గాలు తెలిపాయి. ఆ మూవీలో స్పెషల్ పాత్రలో కాసేపు కనిపించనున్నారు. ఈ చిత్రంలో డేవిడ్ వార్నర్ సీన్ షూటింగ్ మూడో రోజుల కిందట ఆస్ట్రేలియాలో జరిగింది. ఆ లొకేషన్ నుంచే ఫొటోలు లీక్ అయ్యాయి. రిలీజ్ చేసిన చిత్రాల్లో వార్నర్ స్టయిలిష్ లుక్ లో అదరగొట్టేశాడు. 37 ఏళ్ల ఈ ఆసీస్ మాజీ ఓపెనర్ తెల్లటి చొక్కాతో షూటింగ్ స్పాట్ లో ఎరుపు హెలికాప్టర్ నుండి దిగి వస్తూ హల్ చల్ చేస్తున్నాడు. పెద్ద లాలిపాప్‌ను పీలుస్తూ సన్ గ్లాస్ పెట్టుకొని అభిమానులను సర్ ప్రైజ్ చేశాడు. గోల్డెన్ తుపాకీతో వార్నర్ జేమ్స్ బాండ్ సినిమా తరహాలో కొందరిని కాలుస్తున్నట్టు స్పష్టంగా తెలుస్తుంది.
వార్నర్ ఇప్పటికే అంతర్జాతీయ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించాడు. టీ20 వరల్డ్ కప్ 2024లో భాగంగా భారత్ తో ఆసీస్ మ్యాచ్ ఓడిపోవడంతో వార్నర్ అంతర్జాతీయ కెరీర్ ముగిసింది. టీ20 ప్రపంచకప్ 2024 తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తానని ఈ లెఫ్ట్ హ్యాండర్ ఈ ఏడాది ప్రారంభంలో చెప్పిన సంగతి తెలిసిందే. దీంతో వార్నర్ అంతర్జాతీయ కెరీర్ ముగిసింది. ఇప్పటికే టెస్ట్, వన్డేలకు ఈ ఆసీస్ ఓపెనర్ గుడ్ బై చెప్పిన సంగతి తెలిసిందే.

# ఫోటో స్టోరి: కాబోయే అక్కినేని కోడలు స్టన్నింగ్ ఫోజ్

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో అత్యంత స్టైలిష్ నటీమణుల జాబితా తిరగేస్తే అందులో శోభిత పేరు టాప్‌లో ఉండాల్సిందే. నేటితరంతో జాన్వీ, సారా, అనన్య, కియరాతో పోటీపడే సత్తా తెలుగమ్మాయి(తెనాలమ్మాయి) శోభితకు ఉంది. బీచ్ సొగసుల విశాఖ నుంచి ముంబై సహా రాజధానిలో అందాల పోటీల్లో పాల్గొని కిరీటం గెలుచుకున్న అనుభవజ్ఞురాలిగా, టాప్ మోడల్ గా శోభిత ఉన్నత స్థాయిని అందుకుంది. అది ఇప్పుడు రంగుల ప్రపంచంలో తన హవాకు అన్ని విధాలా సహకరిస్తోందని చెప్పాలి. స్టైల్ కంటెంట్ లో శోభితను కొట్టేవాళ్లే లేరు. నటనా ప్రతిభలోను తనను మించిన వారు లేరు. అంత గొప్ప పేరు తెచ్చుకుంది. త్రిష, తమన్నా, కాజల్ లాంటి అందగత్తెలకు లేని పేరు ఇప్పుడు బాలీవుడ్ లో శోభితకు ఉంది అంటే అది అతిశయోక్తి కాదు. అంతేకాదు శోభిత నటించిన %–%ది నైట్ మేనేజర్%–% ప్రతిష్ఠాత్మక ఎమ్మీ అవార్డ్స్ 2024 ఉత్సవాలకు వెళుతోంది. ఇలాంటి క్రెడిట్ సౌత్ నుంచి బాలీవుడ్ కి వెళ్లిన ఇతర నటీమణులకు లేదు. %ూశ్రీంశీ =ఝుం% – జపనీస్ రెస్టారెంట్ ప్రారంభించిన నేహాశర్మ ఇక ఇదే ఉత్సాహంలో శోభితలో జోష్ అంతకంతకు పెరుగుతోందే కానీ తరగడం లేదు. ఇటీవలే నాగచైతన్యతో నిశ్చితార్థం అనంతరం ఈ బ్యూటీ మరింతగా షైన్ అవుతోంది. తాజాగా శోభిత షేర్ చేసిన ఓ ఇన్ స్టా ఫోటోగ్రాఫ్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. చూడగానే స్వీట్ 16 అనిపిస్తోంది! అంటూ అభిమానులు ప్రశంసిస్తున్నారు. బ్లాక్ చెక్డ్ ప్యాంట్‌తో క్లాసిక్ వైట్ టాప్‌లో శోభిత స్టైలిష్ గా కనిపించింది. నల్లటి మాస్కరా, ఓపెన్ హెయిర్, బ్రౌన్ లిప్‌స్టిక్ తన గ్లామర్ ని మరింతగా ఎలివేట్ చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ స్పెషల్ లుక్ అభిమానుల సోషల్ మీడియాల్లో వైరల్ గా మారుతోంది.



**సంయుక్తా మీనన్ ట్రెండీ లుక్ ప్యూర్ పర్ఫెక్షన్**





**జాన్వీ కపూర్ డ్రెస్ ఎప్పుడూ షోస్టాపర్**

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com